మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## కళాశాలలో ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

**నర్సాపూర్, నవంబరు 8, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండలపరిధిలోని చిప్పల్‌తుర్తి కస్తూర్బాగాంధీ కళాశాలలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ సుహాసినిరెడ్డిల ఆధ్వర్యంలో కెజిబివి కళాశాల విద్యార్థులతోకలిసి కేక్ కట్‌చేసి ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సామాన్య కార్యకర్తగా జిల్లా పరిషత్ మెంబర్‌గా ప్రస్థానం మొదలుపెట్టి రాజకీయంలో తనదైన శైలిలో అతికొద్ది కాలంలోనే ప్రజల మనసు గెలిచిన ప్రజానాయకుడన్నారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు అంచెలంచలుగా ఎదిగి దేశవ్యాప్తంగా తనదైన ముద్రవేసుకుని రాష్ట్రాభివృద్ధి కోసం రాష్ట్రప్రజలసంక్షేమంకోసం శ్రమిస్తున్ననాయకుడని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపిపిలు జ్యోతిసురేష్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు మల్లేశం, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, రుస్తుంపేట్ మాజీ ఎంపిటిసి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, ఓబిసిసెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్,, సుధీర్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొనారు.

## 14 మంది కేబుల్ వైర్ దొంగల రిమాండ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

సిద్దిపేట పట్టణంతోపాటు బోధన్‌లో బిఎస్‌ఎన్‌ఎల్ కేబుల్ వైర్లు దొంగిలించిన దొంగలముఠాను పట్టణ వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులనుంచి గూడ్స్ బొలేరో ఆటో, 260మీటర్ల బిఎస్‌ఎన్‌ఎల్ కేబుల్‌వైరు, గడ్డపారలు10, పారలు12, 8సెల్‌ఫోన్లు, రూ. 2లక్షల నగదును స్వాధీనంచేసుకున్నారు. వన్‌టౌన్ సిఐ వాసుదేవరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటలో కేబుల్‌వైరు దొంగిలించి బోధనకువెళ్లి, దొంగతనంచేసి తిరిగి సిద్దిపేటమీదుగా పెద్దపల్లివెళ్తుండగా పట్టణంలోని నాగదేవతగుడి చౌరస్తాసమీపంలో 14మందిని అదుపులోకి తీసుకున్నట్లుతెలిపారు. జంగారెడ్డిగూడెంకుచెందిన 14మంది వ్యక్తులు వేముల బుజ్జి, గంజే లక్ష్మయ్య, తురక ఏడుకొండలు, వేముల బుడ్డియ్య(చిన్న), కుంచాల పాండు, గుంజ వెంకన్న, వేముల సుజాత, కుంచాల మల్లీశ్వరీ, తురక వెంకటలక్ష్మీ, వేముల పాటమ్మ, వేముల సత్తిరాజు, వేముల దుర్గప్రసాద్‌లతోపాటు మరో ఇద్దరు బాలనేరస్థులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కొన్యాల బాల్‌రెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డితో కొన్యాల బాల్‌రెడ్డి

**ములుగు, నవంబరు 8, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ములుగు మండలానికి చెందిన కెబిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి శనివారం హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొన్యాల బాల్‌రెడ్డి మాట్లాడుతూ ములుగు మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, మండలంలో నెలకొన్న పలు సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## వివాహవేడుకల్లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, నవంబరు 8, ప్రభాతవార్త:**

హైదరాబాద్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి కుమార్తె వివాహ వేడుకలు హైటెక్స్ వేదికగా జరిగిన సందర్భంగా, వేడుకల్లో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితోపాటు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, దుద్దిళ్ల శ్రీనుబాబు, కాంగ్రెస్ నాయకులు, తదితర ముఖ్య నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.

## పెసరపప్పుతో సిఎం చిత్రం

**గజ్వేల్ టౌన్, నవంబరు 8, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు శనివారం పెసరపప్పుతో రేవంత్‌రెడ్డి చిత్రాన్ని అద్భుతంగా చిత్రించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఎందరో నాయకుల చిత్రాలను, భగవంతుని చిత్రాలను చిత్రించడం ఆ భగవంతుడు నాకు ఇచ్చిన ఓ గొప్ప కళ అని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. రామకోటి రామరాజు అద్భుత కళను చూసి పలువురు అభినందనలు తెలిపారు.




పెసరపప్పుతో చిత్రించిన రేవంత్‌రెడ్డి చిత్రం

## రాజీలేని పోరాటాలు చేస్తున్నాం

-సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు





సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

**సిద్దిపేట రూరల్, నవంబరు 8. ప్రభాతవార్త:**

సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు డిసెంబరు 7,8,9వ తేదీలలో మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు తెలిపారు. సిఐటియు జిల్లా కమిటీ సమావేశం శనివారం జిల్లా ఉపాధ్యక్షులు బండస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. మూడురోజుల పాటు నిర్వహించే మహాసభలలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు ప్రతినిధులు కాముని గోపాలస్వామి, భాస్కర్, పద్మ, సత్తిరెడ్డి, చొప్పరి రవికుమార్, తునికి మహేష్, మామిడాల కనకయ్య, అమ్ముల బాలనర్సయ్య, భాస్కర్, ఎండి షఫీ, పోతిరెడ్డి రాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## సరాఫ్‌పల్లి వద్ద ఇసుక లారీ బోల్తా



సరాఫ్‌పల్లి వద్ద బోల్తాకొట్టిన ఇసుక లారీ

**చౌటకూరు, నవంబరు 8, ప్రభాతవార్త:**

అతివేగంగా ఇసుక లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తాకొట్టిన సంఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని సరాఫ్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. జోగిపేట నుంచి సంగారెడ్డి వైపు వెళుతున్న టిఎస్ 12 యుడి 8292 టిప్పర్‌లో సామర్థ్యానికి మించిన లోడ్‌తో వెళుతున్న వాహనం సరాఫ్‌పల్లి వద్ద బోల్తాకొట్టింది. వాహన డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకుని సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. సర్వీసు రోడ్డుపై టిప్పర్ బోల్తాకొట్టడంతో అటుగా వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోల్తా పడిన ఇసుక లారీ నుంచి గ్రామస్థులు ఆలయ నిర్మాణానికి తమకు ఇసుక కావాలంటూ ట్రాక్టర్‌లో ఇసుకను తరలించుకుపోయారు.

# గుంతల రోడ్లపై ప్రయాణం నరకప్రాయం

-పటాన్‌చెరు, దౌల్తాబాద్ రహదారి మరమ్మతులు చేపట్టాలి

-సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రేశం దర్గా వద్ద నిరాహారదీక్ష

**పటాన్‌చెరు, నవంబరు 8, ప్రభాతవార్త:**

పటాన్‌చెరు నుండి ఇంద్రేశం మీదుగా వెళ్లే దౌల్తాబాద్ ఆర్‌అండ్‌బి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని, గుంతలరోడ్డుకు మరమ్మతులు చేయాలని, డివైడర్ ఏర్పాటుచేసి సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు, ఏరియాకమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, వాజిద్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం మండల పరిధిలోని ఇంద్రేశం దర్గావద్ద సిపిఎంపార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహారదీక్షకు సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వాజిద్ అలీ, పాండురంగారెడ్డి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎంపార్టీ ఏరియాకమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు, ఏరియాకమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, వాజిద్ అలీ మాట్లాడుతూ ఇంద్రేశం మున్సిపల్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, గత రెండుసంవత్సరాల నుండి ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. భారీవర్షాలకు పెద్దపెద్దగుంతలు ఏర్పడి ప్రయాణం చేసే వాహనదారులు ఎటు వెళ్ళాలో తెలియక ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని వాపోయారు. ఈమధ్య కురిసిన భారీవర్షాల సందర్భంగా ప్రమాదాలు జరిగాయని, చేతులు, కాళ్లు విరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. మరమ్మతుల కోసం 80లక్షల రూపాయలు మంజూరైనా, నేటికీ ఎందుకు పనులు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఇంద్రేశంప్రాంతం కాలనీలు, అపార్ట్‌మెంట్లు, విల్లాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అవుతుందని ఆరోపించారు. ఈ రహదారిపై భారీ నుంచి అతిభారీ వాహనాలు అధికలోడును తీసుకెళుతూ రహదారులను ధ్వంసంచేస్తున్నా, అధికారగణం చూస్తూ చేష్టలుడిగి ఉందని మండిపడ్డారు. ఈరోడ్డుమీద ప్రజల ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోయారు. ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, సిపిఎంపార్టీ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక ఆందోళన కార్యక్రమాలు, వినతిపత్రాలు, పాదయాత్ర, నిరాహారదీక్ష కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంద్రేశం మున్సిపల్ ప్రాంతంలో ఉన్న ప్రజానీకం సమస్యను దృష్టిలో ఉంచుకొని వెంటనే మరమ్మతులుచేపట్టి, విస్తరణ పనులు ప్రారంభించాలని, డివైడర్ ఏర్పాటు చేసి సెంటర్ లైటింగ్ సిస్టం వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రాంత ప్రజల పక్షాన ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అర్జున్, వీరస్వామి, సదాశివరెడ్డి, సురేష్, మూర్తి, సతీష్, మురళి, శ్రీనివాస్, రాములు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.




నిరాహార దీక్ష చేపట్టిన సిపిఎం నాయకులు

## బయటపడ్డ సిపిఐ పార్టీ అంతర్గత వర్గ విభేదాలు

-రెండుగ్రూపులుగా ఏర్పడి సమావేశాలు



ఒకేసమయంలో ఒకేహాలులో రెండువర్గాల సమావేశం దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 8, ప్రభాతవార్త:**

హుస్నాబాద్ పట్టణంలోని అనబేరి సింగిరెడ్డి అమరులభవన్‌లో కమ్యూనిస్టు పార్టీ నాయకుల అంతర్గత వర్గవిభేధాలు బయటపడ్డాయి. శనివారం అదేపార్టీకిచెందిన రెండు గ్రూపులు ఒకేహాల్‌లో రెండుగ్రూపులుగా ఏర్పడి ఒకేసమయంలో సమావేశాలు నిర్వహించారు. వచ్చే నెల డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న సిపిఐ ఆవిర్భావ శతవసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్ వేరువేరుగా తమ అనుచరులతో సమావేశాలు జరిపారు. ఒకరికొకరు పోటీగా నినాదాలు చేస్తూ వేరువేరుగా సమావేశాలు నిర్వహించడం పట్ల పార్టీనాయకుల అంతర్గతవిభేదాలు బయటకు వచ్చాయి. గత కొన్నిరోజులుగా సిపిఐ పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న నాయకుల కుమ్ములాటలు శనివారం బహిర్గతమయ్యాయి. అయితే హుస్నాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మండల కార్యదర్శి గడిపే మల్లేష్ సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డికి నమ్మినబంటు కాగా, ఆపార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రస్తుత పార్టీ తెలంగాణరాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అనుచరుడని తెలుస్తుంది. అయితే హుస్నాబాద్ ప్రాంతంలో మంచి పేరు, పట్టు ఉన్న సిపిఐ పార్టీలో నాయకుల అంతర్గత విభేదాల వల్ల పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గడిచిన కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్న సిపిఐ పార్టీలో వర్గపోరు విషయంలో ఈప్రాంతంలో పార్టీ మనుగడను కోల్పోతుంది. అయితే పార్టీ తిరిగి బలోపేతం కావాలంటే ఈప్రాంత మాజీ ఎమ్మెల్యే, పార్టీ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కమిటీ, సమితి కార్యవర్గ సభ్యులు ఇరు వర్గాలను కూర్చోబెట్టి నచ్చజెప్పాల్సిన అవసరం ఉందని మేధావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సంవత్సరాలు బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలబడిన పార్టీ నాయకులు ఇప్పుడు వారికివారే వర్గాలుగా ఏర్పడి తన్నుకుంటుంటే ప్రజల సమస్యలు పట్టించుకునేవారు కరువైతారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## నిబంధనల పేరుతో ధాన్యం కొనుగోలుకు కొర్రీలు

-కొన్యాల గ్రామానికి చెందిన రైతుల ఆరోపణ

**హత్నూర, నవంబరు 8, ప్రభాతవార్త:**

నిబంధనల పేరుతో కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన రైతు రాజివ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొన్యాల్ సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఒక బస్తాకి 42 కిలోలు తూకం వేస్తున్నారని, కొన్యాల వీరభద్ర రైస్ మిల్లుకి తీసుకువెళ్లగా అక్కడ ధాన్యం మ్యాచర్ వచ్చింది కాని, వరి కొంచెం నల్లగా ఉంది అని ఇంకా మూడు కిలోల చొప్పున ఇస్తేనే మేము తీసుకుంటామని రైస్ మిల్ యజమాని అంటున్నారని రైతు ఆరోపించాడు. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని స్పష్టంగా చెబుతున్నప్పటికీ, మంత్రులు అధికారులు చెబుతున్న విషయాలు స్థానికంగా అమలుకావడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. నిబంధనల పేరుతో రైతు లను దోచుకోవడం తప్ప లాభంచేసే పనులేవి జరగడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై హత్నూర సొసైటీ సిఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ, రైస్ మిల్లు యాజమాన్యం వడ్లు నల్లగా ఉన్నాయని కొనుగోలు చేయడానికి నిరాకరించగా తాము వెళ్లి రైస్ మిల్ యాజమాన్యంతో చర్చించి వడ్లు కొనుగోలు చేసేలా చేశామని అన్నారు.



ధాన్యం లారీ వద్ద రైతులు పడిగాపులు

## 430 గ్రాముల పాపిస్ట్రా పౌడర్ పట్టివేత

-నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ముమ్మర తనిఖీలు

-ఎక్సైజ్‌శాఖ తనిఖీలో నిందితుడు అరెస్ట్, కేసు నమోదు



రావాల్‌సింగ్‌ను అరెస్ట్‌చేసిన ఎక్సైజ్ సిఐ గులాం ముస్తఫా

**నర్సాపూర్, నవంబరు 8, ప్రభాతవార్త:**

నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈనేపథ్యంలో నర్సాపూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నర్సాపూర్ ఎక్సైజ్ సిఐ గులాం ముస్తఫా నేతృత్వంలో రూట్‌వాచ్‌లో భాగంగా తూప్రాన్ జాతీయ రహదారిలోని మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఓవ్యక్తి వద్ద 430 గ్రాముల పాపిస్ట్రా పౌడర్ లభించింది. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎక్సైజ్ శాఖ సిఐ గులాం ముస్తఫా మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచార మేరకు నర్సాపూర్ ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ పరిధిలో తూప్రాన్ జాతీయ రహదారిలో మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద రూట్ వాచ్ చేస్తుండగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రావల్ సింగ్ వద్ద 430 గ్రాముల పాపిస్ట్రా పౌడర్ లభించినట్లు తెలిపారు. రూట్ వాచ్‌లో బస్సును తనిఖీ చేయగా అతని వద్ద ఈ మత్తుపదార్థం లభించిందని తెలిపారు. ఈ మేరకు రావాల్ సింగ్‌ను అరెస్టు చేసి మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ గులాం ముస్తఫా తెలిపారు. ఈ తనిఖీల్లో నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్సైలు ఎండి ఖాజా అజీజ్ అహ్మద్, వి.రాఘవేంద్రరావు, ఎక్సైజ్ సిబ్బంది అనిల్, సత్తయ్య, ప్రభాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## కన్నతల్లిని కడతేర్చిన కసాయి కొడుకు

-మద్యం మత్తులో కిరాతక ఘాతుకం..

**టేక్మాల్, నవంబరు 8, ప్రభాతవార్త:**



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లోననిందితుడు)

మద్యం మత్తులో కసాయిగామారి కన్నతల్లిని కొడుకే కడతేర్చిన సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామ స్థుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని టేక్మాల్ వేల్పుగొండ గ్రామానికి చెందిన మోహ నగారి సత్యమ్మ (60) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేది. ఆమె కుమారుడు సుదర్శన్(44) మద్యానికి బానిసై రోజూ తాగి కుటుంబసభ్యులతో గొడవ పడుతుండేవాడు. సుదర్శన్ మద్యానికి బానిసకావడం, తరచూ గొడవ పడుతుండటంతో ఆయన భార్య, పిల్లలతోకలిసి నాలుగు, ఐదు సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. నిత్యం మద్యం సేవించి రావడం, తల్లిని డబ్బులు ఇవ్వాలని వేధించడం చేసేవాడు. ఈక్రమంలో శనివారం రాత్రి మద్యం మత్తులో తల్లితో గొడవపడ్డాడు. తల్లి పేరుమీద ఉన్న భూమి తనకు ఇవ్వడంలేదన్న ఉద్దేశంతో రోకలి, గొడ్డలితో తల్లిపై విచక్షణారహితంగా దాడి చేసాడు. తల్లిమర్మాంగాలపై దాడిచేసి హత్యగావించినట్టు పోలీసుల విచారణలో తెలిసింది. మా అమ్మ చనిపోయింది అంటూ అందరినీ నమ్మించే ప్రయత్నం చేశాడు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సత్యమ్మ మృతదేహం పడి ఉండడంతో స్థానికులు, బంధువులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తల్లి పేరుమీద ఉన్న భూమిని తన పేరుమీద మార్చమని అడిగితే, తల్లి నిరాకరించడంతో ఈహత్యకు పూనుకున్నట్లు తెలిసింది. కూతుళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు. సత్యమ్మకు ముగ్గురుసంతానం. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలాన్ని అల్లాదుర్గం యస్ఐ శంకర్, టేక్మాల్ ఎయస్ఐ క్రిష్ణలు సందర్శించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## మంజీరానదిలో యువకుడి శవం

**నాగల్‌గిద్ద, నవంబరు 8, ప్రభాతవార్త:**

యువకుడు అదృశ్యమై మంజీరానదిలో శవమై తేలిన సంఘటన మండల పరిధిలోని ఎనక్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఎనక్‌పల్లి గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి (21) గత రెండురోజుల నుంచి కనపడకుండాపోవడంతో కుటుంబ సభ్యులు నారాయణఖేడ్ పోలీసు ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు మంజీరానదిలో గజ ఈతగాళ్లతో గాలించగా రాయికోడ్ మండలం శిరూర్ గ్రామ శివారులోని మంజీర వంతెన వద్ద మృతదేహాన్ని కనుగొన్నారు.

## 11 మంది జూదరుల అరెస్టు

-రూ.40వేలు, 4మోటార్లు, 14సెల్‌లు స్వాధీనం



పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**జహీరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:**

గుట్టుచప్పుడుకాకుండా పేకాట ఆడుతున్న జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన చిన్న హైద్రాబాద్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కె.వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. చిన్న హైద్రాబాద్ గ్రామశివారులో కొందరు జూదం ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం అందడంతో తనసిబ్బందితోకలిసి జూదగృహంపై దాడిచేసి పేకాట రాయుళ్లు తమకాళ్లకు బుద్ధిచెప్పే అవకాశం ఇవ్వకుండా 11మందిని పట్టుకున్నామన్నారు. జూదగ్రస్థులనుంచి 40వేల150రూపాయలను, 4మోటారుసైకిళ్లను, 14సెల్‌ఫోన్‌లను, 52పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. 11మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## వాసర్‌లో యువకుడు అదృశ్యం

**జహీరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:**

హైద్రాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్న యువకుడు మాలిపాటిల్ దత్తు (30) అదృశ్యమైన సంఘటన మండలపరిధిలోని వాసర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్‌కుమార్ కథనం ప్రకారం.. వాసర్ గ్రామానికి చెందిన మాలిపాటిల్ దత్తు హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు. అక్టోబరు 23న హైద్రాబాద్ నుంచి స్వగ్రామమైన వాసర్‌కు వచ్చి గ్రామానికి చెందిన బిరదర్ హన్మంతుతో కలిసి కంగ్టి మండలానికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదన్నారు. బంధువులు, సన్నిహితులవద్ద దత్తు ఆచూకీకోసం గాలించినా ఫలితం లేకపోవడంతో దత్తు తల్లి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ వివరించారు.

## అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 8(ప్రభాతవార్త):**
అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం రాం నగర్ డివిజన్ దయారామార్కెట్ బండన్ ఫంక్షన్ హాల్ నుండి బాకా రం సాగర్ లాల్ హాస్పిటల్ వరకు నూతనంగా సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ను స్థానికుల చే సత్కరించే కార్యక్రమం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నేత ముఠా జై సింహా. డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి. స్థానికులు రహన్ ఖాన్. ఎస్. వెంకటేశ్వర్ రావు. సైదులు. సిల్వర్ వెంకటేష్.రామ్ రెడ్డి. శ్రవణ్. సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్.ముదిగొండ మురళి.గోశ నవీన్.ఎర్రం శేఖర్.కొండమడుగు మధు.కళ్యాణ్ నాయ క్. జ్ఞానేశ్వర్ గౌడ్.జి.శ్రీనివాస్.గుండు వెంకటేష్.టీవీ.రాజు.మల్లేష్ యాదవ్. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పంచారామక్షేత్రాల్లో అన్నదానానికి అజయ్‌కుమార్ విరాళం



అన్నదాన పథకానికి 5లక్షల విరాళ చెక్కును అందజేస్తున్న అజయ్‌కుమార్, జ్యోతిరాణి, యశ్వంత్‌రావు తదితరులు

**నాంపల్లి, నవంబరు 8 ప్రభాతవార్త :**
కార్తీకమాస పుణ్యదినాలను పురస్కరించుకొని పవిత్ర తీర్థాస్థలాలుగా ప్రఖ్యాతిగాంచిన పంచారామ క్షేత్రాలకు విచ్చేసే భక్తులకు అన్నదాన ప్రసాదం పథకం కొనసాగింపుగా ప్రముఖ సామాజికవేత్త, ఆధ్యాత్మిక సేవకులు పుప్పాల అజయ్‌కుమార్ 5లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించి తన ఆధ్యాత్మిక హృదయాన్ని ఆవిష్కరించారు. ప్రఖ్యాత శివాలయాలైన పంచారామ క్షేత్రాలు పల్నాడు జిల్లాలోని అమరారామం, కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం, పశ్చిమ గోదావరి జిల్లాలోని క్షీరారామం, కాకినాడ జిల్లాలోని కుమారారామం, పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమారామం ఆలయాలకు విచ్చేసే భక్తులకు భోజనాలు సమకూర్చేందుకు అయ్యే ఖర్చుల్లో తనవంతుగా ఒక్కొక్క క్షేత్రానికి లక్ష రూపాయల చొప్పున విరాళాలు అందజేశారు. ఈమేరకు 5 లక్షల రూపాయల చెక్కును అజయ్ కుమార్ ఆయా క్షేత్రాల పాలకవర్గాలకు అందజేసి తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మల్లేపల్లి ఐటిఐ పూర్వ ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతిరాణి, డా. గంట యశ్వంత్‌రావు, దత్తా ప్రసూనలు పాల్గొన్నారు.

## మూడేళ్లుగా అన్నదానం విజయవంతంగా కొనసాగిస్తున్నాం : కొండ విజయ్‌కుమార్



పేదలకు అన్నదానం చేస్తున్న హోప్ ఫౌండేషన్‌చైర్మన్ కొండ విజయ్

**శేరిలింగంపల్లి,నవంబర్ 8 ప్రభాతవార్త**
నిరుపేదల ఆకలిని తీర్చటమే ధ్యేయంగా హోప్ ఫౌండేషన్ ద్వారా మూడేళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. చందానగర్ ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నేటితో 157వ వారానికి చేరుకుంది. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ కొండ విజయ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు, అన్నార్తులకు ఆకలితీర్చే క్రమంలో తమ సేవలను కొనసాగిస్తూ వస్తున్నామని, నేటికి మూడేళ్లు పూర్తిచేసుకుని నాలుగవ సంవత్సరానికి అన్నదాన వితరణ జరుగుతుందన్నారు. ప్రతి శనివారం వేలాది మంది పేదలకు, ఆకలిగొన్నవారికి అన్నదాన కార్యక్రమం చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. సుమారు 2200మంది పేదలకు అన్నదానం చేయటం జరిగిందని తెలిపారు. . ఈకార్యక్రమంలో హోఫ్ పౌండేషన్ సభ్యురాలు అపర్ణ,బాక్సర్ గిరి, సుధాకర్,వర్ధన్,పలువురు సంఘ సేవకులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా బిసిలు పనిచేయాలి : రామచందర్ యాదవ్

**బిసి ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్ నియామకం**



బీసీ ఐక్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బండి రామకృష్ణ గౌడ్

**శేరిలింగంపల్లి,నవంబర్ 8 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర బీసీసంఘాలను ఏకంచేసి,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అద్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ అన్నారు.శేరిలింగంపల్లిలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక ఆద్వర్యంలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీసీ ఐక్యవేదిక భవిష్యత్‌ప్రణాళికలపై సమాలోచనలు జరిగాయి. ఈ సందర్భంగా భేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ..బీసీలంతా ఐక్యమై స్థానిక ఎన్నికలు, జీహెచ్‌ఎంసీ, మునిసిఫల్ ఎన్నికల గురించి సుధీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. బీసీలకు అధికారమే అంతిమ లక్ష్యంగా ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల సహాకారంతో బీసీలంతా ఉద్యమించాలని కార్యవర్గసమావేశంలో నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. విద్యా,ఉద్యోగం, ఉపాధి, వైద్యం, పేదరిక నిర్మూనలలో భాగంగా రోటి,కపుడా,మఖాన్ ఉపాధి ద్వారా కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యవర్గసమావేశంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అద్యక్షులు భేరి రామచంద్రయాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న, వనపర్తి జిల్లా గొర్రెల,మేకల పెంపకం దారుల అద్యక్షులు మదుయాదవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డప్పుకొట్టు హరిబాబు, పాములేటి యాదవ్, సినీ అర్టిస్ట్ లక్ష్మీనారాయణయాదవ్, బీసీకుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య వృత్తి చాలా పవిత్రమైంది : జస్టిస్ రాజశేఖర్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ ఏ రాజశేఖర్ రెడ్డి, చిత్రంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అవులప్ప డాక్టర్ మాధవి తదితరులున్నారు.

**చిక్కడపల్లి నవంబర్ 8 (ప్రభాతవార్త):**
వైద్య వృత్తి చాలా పవిత్రమైందని తెలంగాణ లోకాయు క్త జస్టిస్ ఏ రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వైద్య నిర్లక్ష్యం..వినియోగదారుల రక్షణ చట్టం.. 2019 అంశం పై తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్, ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ తెలంగాణ శాఖ, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సదస్సును జస్టిస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఎప్పటికప్పుడు వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కోర్టు లోక్ అదాలత్ సభ్యురాలు డాక్టర్ అమితా రాణి, లోకాయుక్త రిజిస్ట్రార్ ఆర్. రఘునాథ్ రెడ్డి, సుప్రసిద్ధ వైద్యులు, మహావీర్ ఆసుపత్రుల పూర్వ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ససనకోట ఆవులప్ప, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు డాక్టర్ మాధవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ లింగయ్య, డాక్టర్ జి.దిలీప్,డాక్టర్ పి.భావన, ఉస్మానియా మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తన యాదవ్, తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ కేంద్రం డైరెక్టర్ దేవకి తార, ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ స్మిత సోని, సీనియర్ ఐటీ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ డాక్టర్ సుప్రజ, వినియోగదారుల హక్కుల సంఘం పూర్వ ఛైర్మన్ గౌరీ శంకర్ తదితరులతో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టం

**-దొంగలుగా మారిన దంపతులు**

**-మహిళను వెంబడించి బంగారు చైన్‌ను దొంగిలించిన కేసులో ఇరువురూ అరెస్ట్**



వివరాలు వెల్లడిస్తున్న చిక్కడపల్లి ఏ సి పీ రమేష్ కుమార్, చిత్రంలో చిక్కడపల్లి క్రైమ్ డి ఐ శంకర్, సిఐ రాజు నాయక్ తదితరులు

**చిక్కడపల్లి నవంబర్మ 8 (ప్రభాతవార్త ):**
ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టం కారణం చూపి భార్యాభర్తలిద్దరూ దొంగలుగా మారారు. అవకాశం చిక్కినపుడ్డల్లా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల నుండి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని చిక్కడపల్లి క్రైమ్ పోలీస్ లు అరెస్ట్ చేసారు. శనివారం చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్ ఎల్.రమేష్ కుమార్, స్థానికి క్రైమ్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎం.శంకర్, స్థానిక ఇన్స్పెక్టర్ రాజు నాయక్ తో కలిసి వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కొంగపాడు ప్రాంతానికి చెందిన గుడిపాటి బ్రహ్మయ్య (51 ), గుడిపాటి అంజలి (48) బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బోరబండ ప్రాంతంలో ఉంటూ అవకాశం చిక్కినప్పుడల్లా దొంగతనాలకు పాల్పడడం చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో గత నెల 31 న మొదట ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ లో దిగి అక్కడి నుండి నారాయణగూడ మెట్రో స్టేషన్ సుల్తాన్ బజార్ సమీపంలో రెండు దొంగతనాలకు యత్నించారు. ఆ సమయంలో ఎక్కువగా జనసమూహం ఉండడంతో ఫలించలేదు. చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన సురేఖ ఔరాద్కర్ (69 ) తాను ఇంటికి తిరిగివస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మొహానికి మాస్కును రామకోటి బస్సు స్టాప్ నుండి చిక్కడపల్లి బస్సు స్టాప్ వరకు వెంబడించి చివరకు తన ఇంటి వద్ద లిఫ్ట్ కోసం వేచి చూస్తున్న తరుణంలో బలవంతంగా బంగారు గొలుసును దోచుకుని పరారయ్యారు. ఫలితంగా తన మెడపై రక్తపు కాట్లు పడ్డాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన క్రైమ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పాడి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాగా నవంబర్ 1 వ తేదీన భార్యాభర్తలిద్దరూ దొంగిలించిన సొమ్మును కూకట్ పల్లి మనపురంగోల్డ్ శాఖ లో తాకట్టు పెట్టి రూ.1.13 లక్షల ను తెచ్చుకున్నారు. తాకట్టుపెట్టిన అనంతరం వచ్చిన సొమ్ము లోనుండి తన కుమార్తె వివాహం కోసం చేసిన అప్పును తీర్చారు. చిక్కడపల్లి క్రైమ్ పోలీసులకు పక్క సమాచారం మేరకు శనివారం అశోక్ నగర్ సహారా బేకరీ వద్ద చిక్కాడు. అనంతరం విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారు. సెంట్రల్ జోన్ డిసిపి శిల్పావల్లి , అదనపు డిసిపి బి.ఆనంద్ పర్యవేక్షణలో క్రైమ్ డిఐ శంకర్, సిఐ రాజు నాయక్, ఎస్ ఐ మహమ్మద్ కరీం, క్రైమ్ సిబ్బంది క్రైమ్ కేసును త్వరితంగా ఛేదించడంలో విశేషంగా కృషి చేసారు. క్రైమ్ సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

# మనోరంజకం మిమిక్రీ మ్యాజిక్ మైమ్ కళాప్రదర్శనలు

**-సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

**రవీంద్రభారతి, నవంబరు 8 ప్రభాతవార్త :**
మానసిక ఉల్లాసం, ఆహ్లాదం, ఆనందం, మనోరంజకం నవరసభరితమైన మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ కళాప్రదర్శనలని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. ఇవి ఎల్లవేళలా అన్నిరకాల ప్రజలను ఆకట్టుకుని అలరించే అరుదైన కళలని ఆయన ప్రశంసించారు. అందుకే వీటికి సంబంధించి ప్రత్యేక డిప్లొమా కోర్సును తెలుగు విశ్వవిద్యాలయంలో బోధిస్తున్నట్లు నిత్యానందరావు గుర్తుచేశారు. సమాజహితాన్ని కాంక్షించే ఈ కళలు కళాకారుడి ప్రతిభను చాటడమే కాకుండా వేలాదిమందికి స్వయం ఉపాధికారకాలుగా విరాజిల్లుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కిన్నెర 48వ వార్షికవారోత్సవాల్లో భాగంగా 3రోజుల మాయావినోదం; నాటకోత్సవాల్లో రెండవరోజు శనివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన మాయావినోదం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య వెలుదండ నిత్యానందరావు గౌరవ అతిథులు ప్రముఖ మూకాభినయ కళాకారుడు జెన్నీ, ఇంద్రజాలకుడు బి.వి.సత్యనగేష్, మిమిక్రీ కళాకారుడు పేరడి గురుస్వామి, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి నేటి మాయావినోదంలో అద్భుత ప్రదర్శనలిచ్చిన 21మంది మిమిక్రీ, మేజిక్, మైమ్ కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## విద్యార్థి అమరుల త్యాగం చిరస్మరణీయం : ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కొండా విశ్వేశ్వరరావు

**చిక్కడపల్లి నవంబర్ 8,ప్రభాతవార్త :**
విద్యార్థి అమరుల త్యాగం చిరస్మరణీయం అని ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ పిడిఎస్ యు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ప్రొఫెసర్ కొండా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం కోసం, సమాజ మార్పు కై ఉద్యమిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతూ అమరత్వం పొందిన విద్యార్థి అమరవీరుల త్యాగం చిరస్మరణీయం అని, వారి త్యాగాలతోనే నేటి విద్యా వ్యవస్థలో కొంత మార్పు జరిగిందన్నారు. తరగతి గదిని, సమాజాన్ని వేరు చేస్తూ విద్యార్థులను ప్రశ్నించే తత్వం నుండి పాలకులు తప్పిస్తున్నారనీ, ప్రశ్నించే తత్వం లేకపోవడం వలన నేటి విద్యా వ్యవస్థ కార్పొరేట్ల చేత చిక్కి వ్యాపార సరుకుగా మారేందుకు సులవతరం అయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. మానవ విలువలు తగ్గిపోతున్నాయనీ. విద్యారంగం వ్యాపారికరణ వల్ల పేద విద్యార్థులకు చదువు దూరంమవుతున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థులకు స్కాలర్ షిప్, రియంబర్స్మెంట్ చెల్లించకుండా కమిటీలు వేయడం ప్రభుత్వ ఆధీనంలోనే కొత్త విద్యాసంస్థల్ని నిర్మిస్తామని చెప్పటం వింతగా ఉందన్నారు. కార్పొరేట్ యూనివర్సిటీలకు స్వాగతాలు పలుకుతూ అనుమతులు ఇస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను దెబ్బతీస్తున్నారన్నారు. పాలకులు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, పి.డి.ఎస్.యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్న అప్పారావు, మాజీ రాష్ట్ర నాయకులు పి వరదయ్య, ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సాంబ లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ సతీష్, సహాయ కార్యదర్శిలు కే గణేష్, జె గణేష్, కోశాధికారి ఎం సైదులు, రాష్ట్ర నాయకులు వంశీ, సుమన్, విజయ్, రాజు, వినోస్ పాల్గొన్నారు

# నేడు పోటాపోటీగా వాహన ర్యాలీలు

**-పాల్గొననున్న సిఎం రేవంత్‌రెడ్డి, ,మాజీ మంత్రి కెటిఆర్**

**- నేటి నుంచి ఆంక్షలు అమలు**



**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. అక్టోబరు 13న ఎన్నికల అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. అక్టోబరు 13 నుంచి 20 వరకు నామినేషన్లను స్వీకరించారు. 21న స్క్రూటినీ, 23న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీతపాటు రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం కలుపుకొని 58 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఆప్ పార్టీ, యుగతులసి, కొబ్బరి చెట్టు గుర్తున్న అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తూ కనిపించారు. మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు దాదాపుగా ప్రచారంలో పెద్దగా కనిపించలేదు. ప్రచారానికి ఈ నెల 9న తెర పడుతుండటంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల ఆధ్వర్యంలో నియోజకవర్గం మొత్తం వాహన ర్యాలీలు ఏర్పాటుచేశారు. నవంబరు 11న ఎన్నికల దృష్ట్యా నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ సైతం ఇప్పటికే కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు అయిన 14న జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో ఆంక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. నేటి సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికల ఆంక్షలు అమలవుతాయని అన్నారు. ఈ నెల 14న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డీఆర్‌సీ కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో ఆంక్షలు ఉంటాయన్నారు. ప్రజలు గుమిగూడి గుంపులుగా ఉండవద్దని, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బద్రతాచర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

## పండుగలు ప్రాచీన సంస్కృతికి ప్రతిబింబాలు

**-కార్పొరేటర్ పావని వినయ్ కుమార్**



కార్యక్రమంలో పాల్గొన్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి నవంబర్మ 8 (ప్రభాతవార్త ):**
పండుగలు ప్రాచీన సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలుస్తాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ నివి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళకు ఉచిత కుట్టు,మగ్గం,బ్యూటిషియన్ పలు అంశాలపై శిక్షణ పొందుతున్న మహిళలు వన భోజనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎ.పావని వినయ్ కుమార్ పాల్గొని నిర్వాహకులు, మహిళలతో కలిసి భోజనం చేసి ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న ఈ దశలో మన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచారాలను పాటిస్తూ, కార్తీక మాసం వన భోజనం ఏర్పాటు చేయడం శుభ పరినామం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రజీత,సారిక, మంజుల,విద్య, సంగీత,జ్యోతి,ప్రతిమ,టైలరింగ్ టీచర్ల లత , ప్రియాంక ( బ్యూటీషన్), రజిత ( మగ్గం) తో పాటు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేస్తుంది

**- బిఆర్‌ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః** కాంగ్రెస్ పార్టీ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేస్తుందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కారుకు ఓటువేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాగంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, కార్పొరేటర్లు సామల హేమ, ప్రసన్నలక్ష్మి, లతతో కలిసి ఎర్రగడ్డ డివిజన్ నేతాజీ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తప్పనిసరిగా బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ చెప్పిన వాగ్ధానాలను, చేసిన మోసాలను ప్రజలు గుర్తించారన్నారు. ఈ ఎన్నికల్లో అందుకు తగిన తీర్పునిస్తారని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## గోదారంగనాయకస్వామికి ఊంజల్ సేవ, లక్షదీపోత్సవం



దీపోత్స వంలో పాల్గొన్న దంపతులు

**ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లో శనివారం సాయంత్రం లక్షదీపోత్సం ఘనంగా జరిగింది. శ్రీగోదాసమేత మన్నార్‌రంగనాయకస్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అండాలమ్మకు ఉయ్యాలసేవ/ఉంజిల్ సేవ నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల మంత్రోచ్చారణాల మధ్య లోకకళ్యాణార్థం, గ్రామ సుభిక్షం కోసం లక్ష దీనోత్సవం నిర్వహించారు. అర్చకుల సూచన మేరకు పలువురు దంపతులు అమ్మవారి మండపం ముందు 365 వత్తుల దీపాలను వెలిగించారు. దీపాల వెలుగులతో ఆలయ పరిసరాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. అనంతరం భక్తులు ఆలయంలో గోదాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



ఎదులాబాద్‌లో గోదాదేవికి ఉయ్యాలసేవ

## అక్రమంగా తరలిస్తున్న 66 పశువులు పట్టివేత

**-నలుగురిపై కేసు నమోదు**



పోలీసులు పట్టుకున్న ఆవులు, ఎద్దుల వాహనం

**ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త:** అక్రమంగా ఆవులు, ఎద్దులను కభేళాకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి ఘట్‌కేసర్ పోలీసులు బైపాస్‌రహదారి ఎదులాబాద్ రోడ్డు వియూపి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పశువులను తరలిస్తున్న అశోక్‌లేలాండ్ వాహనం (టిఎస్15యుఇ-8156)ను ఆపి పరిశీలించగా 66 పశువులు ఉన్నాయి. వాహనంలో 31 ఆవులు, 35 ఎద్దులు ఉండటంతో విచారణ జరిపి డ్రైవర్‌తో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యాజమాని అఫ్రోజ్ సూచన మేరకు వీరుముగ్గురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ సమీపంలోని హనుమాన్‌జంక్షన్‌లో పశువుల సంతలో 66 పశువులను కొనుగోలు చేసి వాహనంలో టార్పాలిన్‌తో కప్పి అక్రమంగా తరలిస్తున్నారు. హైదరాబాద్‌లోని బహుదూర్‌పురాలోని జంతువధశాలలో 66 పశువులను వధించడానికి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం షామ్లా జిల్లా ఖొండకాకు చెందిన డ్రైవర్ ఇస్తాకర్ (34)తో పాటు సహాయకులుగా వచ్చిన ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్, రూర్కీకి చెందిన గుల్షన్ (24), ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం సహరాన్‌పూర్, కైలాష్‌పూర్ మహల్లా పీత్వాలాకు చెందిన ఎండి.కలీమ్ (32)లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని, ఆవులను గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

## ప్రమాద బాధితునికి సన్‌రైజ్ ట్రస్ట్ రూ.20 వేలు ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన యువకుడికి ఎన్‌ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీకి చెందిన శివరాత్రి బాలాజీ (16) వారం రోజుల క్రితం బైక్ ప్రమాదానికి గురయ్యాడు. బాలాజీ ముక్కు, ముఖం, కాళ్లకు తీవ్రగాయాలు కాగా ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించారు. బాలాజీ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోగా తండ్రి అనారోగ్యంతో ఏమి చేయలేక ఇంట్లోనే ఉంటుండగా తల్లి కూలీ పనికి వెళ్తున్నది. ఆసుపత్రి ఖర్చులు భరించేస్తోమత లేకపోవడంతో ఆర్థికసాయం కోసం సన్‌రైజ్ ట్రస్ట్ సభ్యులు ఎ.వీరారెడ్డిని ఆశ్రయించారు. పేదకుటుంబం కావడంతో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం శనివారం ట్రస్ట్ ద్వారా రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో వై.సుందర్‌రావు, ఎ.వీరారెడ్డి, ఎం.శరబంధ, డి.ఐలయ్య, ఎన్.రామయ్య, ఎం.దేవానంద్, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సినీ కార్మికుల ప్రయోజనానికి సిఎం కృషి

**జూబ్లీహిల్స్, నవంబరు 8, ప్రభాతవార్తః** తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిలింఛాంబర్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనీల్‌కుమార్, తెలుగు ప్రొడోన్ మేనేజర్ యూనియన్ కార్యదర్శి, తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి కానుమిల్లి అమ్మిరాజు, తెలుగు సినిమా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కోశాధికారి శ్రీకాంత్, ఫిలించాంబర్‌కు చెందిన భూషణ్, మాటల రచయిత పరుచూరి గోపాలకృష్ణలతో కలిసి కేక్‌ను కట్ చేశారు. సినీ కార్మికుల ప్రయోజనానికి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వల్లభనేని అనీల్‌కుమార్ అన్నారు. ఆయన మాట ఇస్తే తప్పకుండా చేసి తీరుతారన్నారు. ఈ కారణంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తాము రేవంత్‌రెడ్డికి మద్దతు పలికామని అన్నారు. కార్యక్రమంలో చిత్రపురి కమిటీ సభ్యులు బత్తుల రఘు, టి. లలిత, వేణుగోపాల్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## నాగల్‌గిద్దలో సోయాబీన్ కొనుగోలు కేంద్రం



సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ శ్రీకాంత్

**నాగల్‌గిద్ద, నవంబరు 8, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం మనూర్ సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఆరుగాలం కష్టించి పండించిన సోయాబీన్ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి లబ్ధిపొందాలని, మధ్య దళారులకు అమ్ముకుని ఆగం కావొద్దని మనూర్ సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు ఒసజీవ్‌పటేల్, సొసైటీ కార్యదర్శి జనార్ధన్, నాయకులు మోహన్‌రెడ్డి, మారుతి, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలి

**-పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు**

**సిద్దిపేట అర్బన్, నవంబరు 8, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కావాలంటే మరో 10 యేండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.ఇమామ్(అత్తు) అన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ చేసిన అప్పులను తీర్చుకుంటూ సిఎం రేవంత్‌రెడ్డి నిరంతరం ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, ముద్దం లక్ష్మీ, సతీష్, సాకి అనంద్, మధు, అంజయ్య, గయాజుద్దీన్, వహాబ్, పద్మ, రేణుక, శ్రీనివాస్, కవిత, సంతోషి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఓటములు సహజం

**-టి.సాంఘిక సంక్షేమ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ రజని**



విజేతలకు కప్‌ను అందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, నవంబరు 8, ప్రభాతవార్త:**
ఆటలలో గెలుపు ఓటములు సహజంగా ఉంటాయని క్రీడా పోటీలను స్పోర్టివ్‌గా తీసుకొని ముందుకు సాగాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ రజని అన్నారు. మండల పరిధిలోని మిట్టపల్లిలో జరుగుతున్న 11వ జోన్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు పురస్కరించుకొని శనివారం ఆమె పాల్గొని విద్యార్థులు ఆడుతున్న ఆటలను పరిశీలించి అనంతరం ఆయా క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడ పోటీల్లో ఎంత ఉత్సాహంతో పాల్గొన్నారో అదే ఉత్సాహంతో మంచిగా చదువుకొని అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలన్నారు. పరీక్షల సమయం దగ్గరపడుతుందని మంచిగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థుల క్రమశిక్షణ చాలా బాగుందని గురుకులాలలో విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడా పోటీలలో పాల్గొనడానికి కృషిచేసిన పిఈటి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. మూడు రోజుల పాటు కామరెడ్డి, సిద్దిపేట జోన్ లెవల్లో జరిగిన క్రీడా పోటీలలో 15 గురుకుల కళాశాలల నుంచి 1275 మంది విద్యార్థులు, 30 పిఈటిలు, 60 మంది ఎస్కార్ట్ టీచర్స్ పాల్గొన్నారని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో డిసిఓ నరసింహచారి, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మాంజలి, ఉపాధ్యాయులు నిర్మల, మీరా, ఇన్‌చార్జి వాసు దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాస్ఫూర్తితో ఆడాలి-విజయం కోసం పోరాడాలి

**-క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఎస్ఐ శంకర్**

**అల్లాదుర్గం, నవంబరు 8, ప్రభాతవార్త:**
క్రీడలను క్రీడాస్ఫూర్తితో ఆడాలని, గెలుపే లక్ష్యంగా ఆటలో పోరాటం చేయాలని ఎస్ఐ శంకర్ సూచించారు. మండల పరిధిలోని ముస్లాపూర్‌లో ఏఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ శంకర్ బ్యాటింగ్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొననున్న ప్రతి టీం టోర్ని దక్కించుకునేందుకు (గెలుపుకోసం) క్రీడా స్ఫూర్తితో పోరాటం చేయాలని క్రీడాకారులకు సూచించారు. మండలంలో ప్రీమియం లీగ్ నిర్వహించడం శుభపరిణామమని, క్రీడలతో స్నేహ భావాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు గోండ్ల రవి, ఆయా గ్రామాల క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపనే ఎర్రజెండా లక్ష్యం

**-సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్**



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 8, ప్రభాతవార్త:**
సమసమాజ స్థాపనే ధ్యేయంగా సిపిఐ పార్టీ పోరాడుతుందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని అణభేరి, సింగిరెడ్డి అమరులభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం సిపిఐ అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల కార్యవర్గ, కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో సిపిఐ పార్టీ ఆవిర్భవించి 100సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26వ తేదీన లక్షలాదిమందితో ఖమ్మంలో శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు ప్రపంచంలోని 40దేశాల్లో ఉన్న కమ్యూనిస్టు ప్రతినిధులు, దేశంలోని అన్నిరాష్ట్రాల నుండి కమ్యూనిస్టు కార్యకర్తలు పార్టీశ్రేణులు సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని, అందుకు సిపిఐ రాష్ట్రసమితి ఏర్పాట్లు చేస్తున్నదని దానిలో భాగంగా ప్రచారాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు సిద్దిపేట జిల్లా నుండి పార్టీ కార్య కర్తలు పెద్ద ఎత్తున తరలాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ అక్కన్నపేట, కోహెడ మండలాల కార్యదర్శులు కొమ్ముల భాస్కర్, వేల్పుల శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేశ్, జేరిపోతుల జనార్దన్(జెజె), పిల్లి రజిని, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొజ్జపురి రాజు, ముంజ గోపి, నాయకులు కొయ్యడ కొమురయ్య, మిట్టపల్లి మొండయ్య, మాడిశెట్టి శ్రీధర్, రోళ్ల భాగ్య, సుధాకర్, వేల్పుల ప్రసన్న కుమార్, గట్టు బాబు, పిట్టల శ్రీను, బండారు లక్ష్మణ్, జాగిరి బాలయ్య తదితరులు ఉన్నారు.

# పోలీసులను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్న మంత్రి

**-ఎబివిపి జిల్లా హాస్టల్స్ కన్వీనర్ చెన్నూరి రాజేష్**




ఎబివిపి నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసుల దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసులను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని ఎబివిపి జిల్లా హాస్టల్స్ కన్వీనర్ చెన్నూరి రాజేష్ మండిపడ్డారు. శనివారం ఎబివిపి హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదలచేయాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్ర రవాణా, బిసిసంక్షేమ మంత్రి, స్థానిక శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించిన విద్యార్థులను ముందస్తు అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8500కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థిపరిషత్ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ, ప్రభుత్వం విద్యార్థులను విస్మరించిన కారణంగానే స్థానిక శాసనసభ్యులు, మంత్రికి విద్యార్థుల సమస్యలను విన్నవించడానికి వినతిపత్రం అందజేసి ఈ విషయంలో స్పందించాలని క్యాంపు కార్యాలయంలో కోరడానికి బయలుదేరిన విద్యార్థినాయకులను పోలీసులతో అరెస్టుచేయించడం సరికాదని, హుస్నాబాద్ ప్రాంతంలో విద్యారంగ సమస్యలపై నిరసన తెలిపిన కేసులు బనాయించడం, ధర్నాలు చేస్తే జైలుకు పంపడానికి ప్రయత్నం చేయడం, బైండ్ ఓవర్ చేయడం, కనీసం అడుగుదామంటే అడ్డుకొని అరెస్ట్ చేయడం చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందని అన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వ కార్యాలయమైన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు విద్యార్థులు వెళ్లే హక్కులేదా దోపిడీ దారులు, బ్రోకర్లు మాత్రమే లోపలికి పోవడానికి అనుమతి ఉన్నదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే దిశగా వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చరణ్, నగర ఉపాధ్యక్షులు రాహుల్, రాజు, నగర సంయుక్త కార్యదర్శి అంజి, సంతోష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ పాలసీని ఉపసంహరించుకోవాలి

**-సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు**




సిబిఎల్ పరిశ్రమలో మాట్లాడుతున్న చుక్క రాములు

**చౌటకూరు, నవంబరు 8, ప్రభాతవార్త:**
కేంద్రప్రభుత్వం ప్రకటించిన లేబర్‌పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. మండలపరిధిలోని శివంపేటలోని సిబిఎల్ పరిశ్రమలో ఎబిఇన్ బేవ్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి ఎబిఇన్ బేవ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, రాష్ట్ర సిఐటియు అధ్యక్షులు చుక్క రాములు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులకు అంతంతగా ఉన్న హక్కులు లేబర్‌పాలసీ ప్రకటనతో పూర్తిగా హరించుకుపోతాయన్నారు. కార్యవర్గ హక్కుల రక్షణకై సిఐటియు నిరంతరం పోరాటాలుచేస్తూ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. డిసెంబర్ 7,8,9వ తారీఖులలో మెదక్ పట్టణంలో సిఐటియు రాష్ట్ర 5వ మహాసభలను, డిసెంబరు 31న 2026 జనవరి 1,2,3,4 తేదీలలో విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని చుక్క రాములు కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు సంగారెడ్డిజిల్లా అధ్యక్షులు మల్లేశం, ఉపాధ్యక్షులు బాగారెడ్డి, యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025 క్రీడాపోటీలు

**-విజేతలకు ట్రోఫీలు అందజేసిన రీజినల్ మేనేజర్ శ్రీనివాస్**



ఫొటో/సిద్దిపేట-4: విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, నవంబరు 8, ప్రభాతవార్త:**
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025 సందర్భంగా జిల్లాకేంద్రంలో శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలలో బ్యాంకుసిబ్బంది ఉత్సాహంగాపాల్గొని క్రికెట్, ఇండోర్‌గేమ్స్‌లో తమప్రతిభను చాటారు. క్రీడాపోటీలు ముగిసిన అనంతరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ బి.శ్రీనివాస్ చేతులమీదుగా విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రాఘవ, విజిలెన్స్ ఆఫీసర్ రవితేజ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఉచిత వైద్యశిబిరం

**కొండపాక, నవంబరు 8, ప్రభాతవార్త:**
అన్నిరకాల సమస్యలు హోమియోపతివైద్యంలో నయం చేయబడుతాయని డాక్టర్ నొమ్య అన్నారు. శనివారం దుద్దెడ గ్రామ పంచాయతీ అవరణలో హైదరాబాద్‌లోని రామంతపూర్ ధర్మకిరణ్ ప్రభుత్వ హోమియో అసుపత్రి, సిద్దిపేట ప్రభుత్వ ఆయుష్‌విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఉచితహోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ధర్మకిరణ్ ఆసుపత్రి వైద్యులు అనిల్‌కుమార్ చొరవతో వైద్యశిబిరం నిర్వహించారు. రామంతపూర్‌కు చెందిన వైద్యుల బృందం గ్రామస్థులకు చికిత్స అందించారని అన్నారు. దీనికి సహకరించిన పంచాయతీకార్యదర్శి చక్రపాణిని వైద్యబృందం అభినందించారు.

## ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీమంత్రి



ఆత్మీయ సవమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీష్‌రావు

**రామచంద్రాపురం, నవంబరు 8, ప్రభాతవార్త:**
తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు కెసిఆర్‌నగర్ కాలనీలో అభివృద్ధి పనులను కాంగ్రెస్ సర్కార్ విస్మరించిందని మాజీమంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. శనివారం కెసిఆర్ డబుల్ బెడ్ రూం వద్ద బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డిల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కొల్లూరు ప్రాంతానికి 5ఎకరాలు శ్మశానవాటికకు, 1.5 ఎకరాలు పాఠశాలకు, 1.5ఎకరాలు ఆసుపత్రికి, 10గుంటలు అగ్నిమాపక కేంద్రానికి కేటాయించామని గుర్తుచేశారు. ఖరీదైనప్రాంతంలో పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇచ్చింది మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అని అన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలను అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. ఇక గదిని కూడా కట్టిన దాఖలాలు లేవని అయితే హైడ్రా పేరుతో లక్షల ఇళ్లను మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చేసిందని మండిపడ్డారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠంగా మారాలని హరీష్‌రావు ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు, జిన్నారం మాజీ జడ్పిటిసి సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, బాల్‌రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, తెల్లాపూర్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రెసిడెంట్ దేవేందర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

**-ఎజివో సుబ్రహ్మణ్యం**



గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

**వర్గల్, నవంబరు 8, ప్రభాతవార్త:**
క్రీడలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని ఎజివో సుబ్రహ్మణ్యం, ఆర్‌సివో రాజేశంలు పేర్కొన్నారు. వర్గల్ మండలంలోని ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్‌జెసిలో గతమూడు రోజులుగా జరుగుతున్న అండర్-17 క్రీడలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి విజేతేనని అన్నారు. అండర్-17 క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఖో-ఖోలో ప్రథమ స్థానం వర్గల్ పాఠశాలకు, ద్వితీయ స్థానం ముత్తంగి పాఠశాలకు దక్కిందని వర్గల్ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు. అలాగే వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో ముత్తంగి పాఠశాల నిలిచిందని, ద్వితీయ స్థానంలో వర్గల్ పాఠశాల, కబడ్డీలో ప్రథమ స్థానం చింతమడక పాఠశాల, ద్వితీయ స్థానంలో తూప్రాన్ పాఠశాల నిలిచినట్లు తెలిపారు. అథ్లెటిక్స్ (లాంగ్‌జంప్) విభాగంలో ప్రథమ స్థానంలో ఎం.లక్ష్మి మెదక్ పాఠశాల, ద్వితీయ స్థానంలో వి.వైశాలి నర్సాపూర్ పాఠశాల, తృతీయ స్థానంలో పి.దీక్షిత వర్గల్ పాఠశాల విద్యార్థులు నిలిచినట్లు తెలిపారు. అండర్-17 ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను వర్గల్ పాఠశాల కైవసం చేసుకుందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు.

# పండించిన పత్తినంతా కొనుగోలు చేయాలి

**-యాప్ పద్ధతిని ఉపసంహరించుకోవాలి**
**-టార్జాన్‌పల్లి టోల్‌గేట్ వద్ద పత్తిరైతుల ఆందోళన**



టార్జాన్‌పల్లి టోల్‌గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పత్తి రైతులు

**చౌటకూరు, నవంబరు 8, ప్రభాతవార్త:**
ఆరుగాలం కష్టించి పండించిన పత్తిని పూర్తి స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కొనుగోలులో పరిమితి విధించడం, యాప్ ఆధారిత విధానాన్ని ఉపసంహరించుకోవాలని రైతులు డిమాండ్ చేస్తూ శనివారం టార్జాన్‌పల్లి టోల్‌గేట్ వద్ద సింగూరు చౌరస్తాలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పత్తి కొనుగోలును 12 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో పత్తిలో తేమ శాతం పెరిగిందని, 12 శాతం కంటే తక్కువ తేమ పరిమితిని కలిగి ఉండటంతో తమకు తీవ్ర అన్యాయం జరిగే సూచనలు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. యాప్ ఆధారిత ఎల్-1, ఎల్-2, ఎల్-3 పద్ధతులు స్మార్ట్ ఫోన్‌లు లేకపోవడంతో, సాంకేతిక లోపాలు, సాంకేతికంగా అవగాహన లేక తాము పడరానిపాట్లు పడాల్సి వస్తోందని విస్మయం వ్యక్తం చేశారు. పత్తి విక్రయానికి ప్రత్యక్ష హాజరు కర్మాళ్లను తీసివేయాలని డిమాండ్ చేసారు. నిరసన కార్యక్రమంలో పుల్‌కల్, అందోల్, వట్‌పల్లి, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, చౌటకూరు మండలాలకు చెందిన పత్తి రైతులు పాల్గొన్నారు. గతంలో కొనుగోలు చేసినట్లు తమ నుంచి పత్తిని కొనుగోలు చేసి వెంటనే బిల్లులను చెల్లించాలని రైతులు ప్రభుత్వానికి సూచించారు. రైతులు నిరసన వ్యక్తం చేస్తున్న తరుణంలో నారాయణఖేడ్ డిఎస్‌పి, సిఐ, ఎస్ఐ, జోగిపేట సిఐ, పుల్‌కల్ ఎస్ఐ, సంగారెడ్డి అర్బన్ సిఐ, రూరల్ ఎస్ఐ తమ సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

## సంకష్టచతుర్థి పూజలందుకున్న వినాయకుడు

**న్యాల్‌కల్, నవంబరు 8, ప్రభాతవార్త:**
సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని రేజింతల్, హద్నూర్ గ్రామాల శివారులో స్వయంభువుగా వెలిసి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న స్వయంభూ శ్రీసిద్ధివినాయక, శ్రీ వరసిద్ధి వినాయక ఆలయాలు భక్తులతో సందడిగామారాయి. ఆలయాల్లోని విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి చందనంలేపనంచేసి రంగు రంగులపూలు, గరికలతో అందంగా ముస్తాబుచేసి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. రేజింత్ గ్రామశివారులోని సిద్ధివినాయక ఆలయంలో కర్నాటకలోని బీదర్, జహీరాబాద్ పట్టణానికి చెందిన భక్తుల సహకారంతో, హద్నూర్ శివారులోని శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో హద్నూర్ గ్రామానికి చెందిన పాత్రికేయుడు గున్నాల విఠల్ సహకారంతో, ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. వరసిద్ధి వినాయక ఆలయానికి హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్ గ్రామ భక్తులతో కలిసి ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## సరస్వతి శిశుమందిర్ అభివృద్ధికి కృషి



శంకుస్థాపన చేసిన రోటరీ క్లబ్ సభ్యులు, పూర్వ విద్యార్థులు

**సదాశివపేట, నవంబరు 8, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణంలో సేవాదృక్పథంతో, తక్కువ ఫీజ్‌తో భారతీయ సంస్కృతి ఆధారంగా విద్యను అందిస్తున్న శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల నూతన అంతస్తు నిర్మాణానికి రోటరీక్లబ్ సదాశివపేట, మొహినాబాద్ డిస్ట్రిక్ట్ రోటరీక్లబ్ సభ్యులు, శ్రీసరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు శంకుస్థాపన చేశారు. ఈశంకుస్థాపన కార్యక్రమంలో రోటరీక్లబ్ సదాశివపేట అధ్యక్షులు ఒడెల ప్రభుగుప్తా, కార్యదర్శి బుస అశోక్, కోశాధికారి ముద్ర వేణు, సహాయకార్యదర్శి మఠం రాచన్నస్వామి, సర్వీస్ డైరెక్టర్స్ దిడ్డికే వినోద్, డాక్టర్ మామిడి చంద్రశేఖర్, డాక్టర్ రామకృష్ణారెడ్డి, చంద్రికి రవీందర్, శరత్‌చంద్ర, పాఠశాల పూర్వ విద్యార్థి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథ, మాజీ కౌన్సిలర్ కంది ఇంద్రమోహన్‌గౌడ్, వాసరచెట్ల పరమేశ్వర్, కటకం కిరణ్, సంగమేశ్వర్, పాఠశాల కార్యదర్శి తంగడపల్లి లక్ష్మణ్, ఉల్లిగడ్డల నాగు, గందిగే రాజు, ప్రధాన ఆచాజి సంగమేష్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కుల సాధన కోసమే చలో ఢిల్లీ

**-జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇంచార్జ్ ఆరె కిశోర్**



చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆరె కిశోర్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 8, ప్రభాతవార్త:**
రాజ్యాంగ హక్కుల సాధన కోసమే జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ ఆరె కిశోర్ ప్రకటించారు. శనివారం హుస్నాబాద్ పట్టణకేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ పిలుపు మేరకు రాజ్యాంగ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మీడియా సెల్ కన్వీనర్ జాల శ్రీనివాస్, జై భీమ్ సైనిక్‌దళ్ హుస్నాబాద్ మండల అధ్యక్షులు దుంద్ర సుమన్, అక్కన్నపేట మండల బాధ్యులు గిరిమల గిరిప్రసాద్, కోహెడ మండల నాయకులు పాక శ్రీనివాస్, హుస్నాబాద్ మండలం నాయకులు సావుల రమేష్, ద్యాగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన గురుకుల జోనల్ క్రీడలు




క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు

**హత్నూర, నవంబరు 8, ప్రభాతవార్త:**
సాంఘికసంక్షేమ గురుకులవిద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న బాలుర 11వ జోనల్ స్పోర్ట్స్ శనివారం ముగిసాయి. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన హత్నూరలోని స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళాశాలలో మూడురోజులపాటు సాగిన క్రీడల్లో, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఉమ్మడిమెదక్ జిల్లాలకు చెందిన 935మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ డిసిఓ, ఉప్పల్‌కళాశాల ప్రధానాచార్యులు పి.వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ పోటీలలో వ్యక్తిగత ఓవరాల్ ఛాంపియన్స్‌గా అండర్ 14 ఉప్పల్ పాఠశాల, అండర్ 17 షేక్‌పేట పాఠశాల, అండర్ 19 సింగూర్ పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్స్‌గా అండర్ 14 సింగూర్ పాఠశాల, అండర్ 17 సింగూర్ పాఠశాల, అండర్ 19 సింగూర్‌పాఠశాల మూడూ ఈపాఠశాలే కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ఫర్ గేమ్స్‌లో అండర్ 14 సింగూర్ పాఠశాల, అండర్ 17 కొండాపూర్ పాఠశాల, అండర్ 19 అంబేద్కర్ జూనియర్ కాలేజ్, హత్నూర కళాశాలలు కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ఫర్ గేమ్స్ అండ్ అథ్లెటిక్స్‌లో అండర్ 14 సింగూర్ పాఠశాల, అండర్ 17 హత్నూర యూజీకళాశాల, అండర్ 19 సింగూర్‌కళాశాల విజేతలుగా నిలిచి ట్రోఫీలు అందుకున్నాయి. ముగింపువేడుకల్లో విద్యార్థుల కవాతు, వీడ్కోలు వందనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
1925 డిసెంబర్ 26 ఆవిర్భవించిన సిపిఐ భారతగడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టాపురం లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, కార్మికులతో కలిసి శనివారం కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. పార్టీశతవసంత ఉత్సవాలు పార్టీ ఆవిర్భవించిన కాన్పూర్‌లో 2024 డిసెంబర్26న ప్రారంభమై దేశవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. ఉత్సవాలలో భాగంగా ఈనెల 17న జిల్లాకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 26 ఖమ్మంలో లక్షలాది మందితో ముగింపుసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. వెట్టిచాకిరీ, కార్మికుల, కర్షకులను దోపిడీ నుంచి విముక్తి చేయడానికి సిపిఐ రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. రైతులను, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చే చట్టాలు తీసువచ్చిన బిజెపికి సమయం వచ్చినప్పుడు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్మిక, కర్షక, ప్రజాసమస్యలపై సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగిరాజు నర్సింలు, రాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.